క్లుప్తంగా

గణపతికి ప్రత్యేక పూజలు

నందిగామ: సంకటహర చతుర్థి నేపథ్యంలో సోమవారం నందిగామ పట్టణ, మండలంలోని గణపతి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సంకటహర చతుర్థి నాడు గణపతిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.ఈ నేపథ్యంలో పట్టణంలోని పాత బస్టాండ్‌లోగల పురాతన గణపతి ఆలయంలో స్వామివారికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం లోక శాంతిని కాంక్షిస్తూ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): మండలంలో గుమ్మడిదూర్రు నుంచి అనిగండ్లపాడు వరకు తారురోడ్డు నిర్మాణ పనులకు సర్పంచి నక్కా కమల సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా సర్పంచి కమల మాట్లాడుతూ ఈ రోడ్డు గుంతలమయం కావడంతో సమస్యను ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బీ నిధులు రూ.1.20 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేయిస్తామని వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు బారు సుధారాణి, సొసైటీ అధ్యక్షులు వేముల శేషగిరిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాస్నం కోటేశ్వరరావు, శివాజీ, ప్రవీణ్, సుధాకర్, అచ్యుతరావు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం



నందిగామ: ప్రతి ఇంటికీ అతి తక్కువ ధరకే ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) ఉమ్మడి కృష్ణాజిల్లా మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఐతవరంలో నందిగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతోపాటు పెనుగంచిప్రోలు మండల కేబుల్ ఆపరేటర్లతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం అరుణకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్నెట్ నిత్యజీవితంలో ఒక భాగమైందన్నారు. అతి తక్కువ ధరకే ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే కేబుల్ ఆపరేటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేబుల్ ఆపరేటర్లు కొప్పు హనుమంతరావు, కె.శాంతకుమార్, కొండ, ఎం.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఐదు మండలాల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఐదుగురికి ట్రైసైకిళ్ల పంపిణీ



గండేపల్లి(కంచికచర్ల) : నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గండేపల్లిలోని ఐదుగురు దివ్యాంగులకు మంజూరు చేయించిన ట్రైసైకిళ్లను సర్పంచి బొక్కా రవికుమార్ సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 23వతేదీ వరకు గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆసమయంలో గ్రామానికి చెందిన ఐదుగురు దివ్యాంగులు తమకు ట్రైసైకిళ్లు ఇప్పించాలని ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావును కోరారని తెలిపారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి కలెక్టర్ ఢిల్లీరావుతో మాట్లాడి ఐదు ట్రైసైకిళ్లను మంజూరు చేయించడంతో లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ట్రైసైకిళ్లను ఇప్పించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బెల్లంకొండ సుబ్బారావు, మాజీ ఉపసర్పంచి సంగం దేవరాజ్, కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ పాల్గొన్నారు.

శివరామకృష్ణశాస్త్రికి గౌరవ డాక్టరేట్



నవాబుపేట(పెనుగంచిప్రోలు): హైదరాబాద్‌లోని కిన్నెర గ్రాండ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన జ్యోతిష్య సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞానసంస్థ తనకు జ్యోతిష్య గౌరవ డాక్టరేట్ అందజేసినట్లు నవాబుపేటకు చెందిన లక్ష్మీగణపతి పీఠం వ్యవస్థాపకుడు తమ్మర శివరామకృష్ణశాస్త్రి తెలిపారు. జ్యోతిష్యంలో చేసిన కృషికి ఈ డాక్టరేట్‌ను అందజేసినట్లు ఆయన వివరించారు. శివరామకృష్ణ శాస్త్రికి గౌరవ డాక్టరేట్ లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

పేదల పెన్నిధి సీఎం జగన్

- కొనియాడిన ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే ఉదయభాను
- వత్సవాయిలో రూ.6.52కోట్లతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల ప్రారంభం
- మహిళలకు రూ.12.80కోట్లు అందజేత



మహిళలకు రూ.12.80కోట్ల చెక్కును అందిస్తున్న విప్ సామినేని ఉదయభాను, ఎంపీ కేశినేని నాని

వత్సవాయి: పేద ప్రజల పాలిటి పెన్నిధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కొనియాడారు. వత్సవాయిలో రూ.62లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు, రూ.40లక్షలతో మల్టీపర్పస్ గౌడౌన్, రూ.1.30కోట్లతో సీసీరోడ్లు, రూ.30లక్షలతో డొంకరోడ్లు, రూ.3.20కోట్లతో లింగాల నుంచి రక్షిత మంచినీటి పైపులైన్, రూ.70లక్షలతో పూర్తిచేసిన పైపులైన్ పనులను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలంతా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా పౌరసేవలను అందుకుంటున్నారని చెప్పారు. గతంలో మాదిరిగా కాకుండా అర్హత ఉంటే ఆయా ప్రభుత్వ పథకాలు పార్టీలకతీతంగా పేదలందికీ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారునికే అందించిన ప్రభుత్వం మరొకటి లేదని ప్రజలకు అర్థమైందని, మళ్లీ జగనన్నకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు కేవలం పెత్తందార్ల కోసమే పనిచేస్తారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుచెప్పి పచ్చచొక్కాల వారికే పథకాలు అందజేశారని ఆరోపించారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు రాష్ట్రంలో లేవన్నారు. తన కొడుకును ముఖ్యమంత్రిని చేసేందుకే చంద్రబాబు తపన పడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగానే కూడా గెలవలేని వ్యక్తిని తీసుకువచ్చి ముఖ్యమంత్రిని చేద్దామనుకోవడం దారుణమన్నారు. విజయవాడ లోక్‌సభ స్థానంతోపాటు ఏడు అసెంబ్లీస్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని ఆపలేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలోని అక్కా చెల్లెల్లమ్మల అభ్యున్నతికి కృషిచేస్తూ వారందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ ఆసరాగా నిలుస్తున్నారని కొనియాడారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణ మాఫీ పేరుతో డ్వాక్రా మహిళలను మోసం చేసిన వైనాన్ని మహిళలు నేటికీ మరిచిపోలేదని గుర్తుచేశారు. విమలా ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను మాట్లాడుతూ మహిళలంతా కలిసి మరోసారి సీఎం జగనన్నకు అండగా నిలిచి గెలిపించుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఉదయభాను, కేశినేని నానిలను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మహిళలకు రూ.12.80కోట్లు పంపిణీ..

అనంతరం గాంధీపార్కు సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న 14,425 డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద రూ.12 కోట్ల 79 లక్షల 82వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. క్రమం తప్ప ఏటా ఆసరా పథకం కింద ఆదుకుంటుండటంపై డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తంచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి, ఉపాధ్యక్షులు గాదెల రామారావు, మాదాల వీరయ్యచౌదరి, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, సర్పంచ్ భూక్యా సీతమ్మ, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, మండల పార్టీ నాయకులు చిరుమామిళ్ల ప్రభాకరరావు, రమాకాంత్, పండగ శ్రీను, కొలుసు తిరుపతిరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఎంపీ కేశినేని నాని సవాల్



పేట ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



ఎన్నికల సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని, విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: టీడీపీ అధినేత చంద్రబాబుకు దమ్ముంటే తనపై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని నాని సవాల్ విసిరారు. ఆపోటీలో తానే మూడు లక్షల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేశారు. జగ్గయ్యపేటలోని కోదాడ రోడ్డులోగల బి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం పేట నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ముందుగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను నాయకులు, కార్యకర్తలను ఎంపీకి పరిచయం చేశారు. ఈసందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ పట్టుబట్టి తనను టీడీపీ నుంచి బయటకు పంపించారన్నారు. ప్రజా నాయకుడు, పేదలమనిషి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను వైఎస్సార్‌సీపీలోకి చేర్చుకుని విజయవాడ ఎంపీ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఏముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం నిరంతరం పాటు పడుతున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో పేటలో ఉదయభానును ఎమ్మెల్యేగా గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పనిచేయాలని కార్యకర్తలను కోరారు. విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ నిత్యం అభివృద్ధి కోసం కృషి చేసే విజయవాడ ఎంపీగా కేశినేని నాని గెలుపు అవసరమన్నారు. తనతో పాటు ఎంపీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని కోరారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఎంపీ, ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. అదే విధంగా ఎన్నికలకు సిద్ధం అంటూ నినదిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కోదాడ రోడ్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా బస్టాండ్ వరకు భారీ రోడ్డు షో, బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హసీన్ ఉన్నీసాబేగం, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల బాజీ, ఆవాల భవానీ, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎంపీపీలు మార్కపూడి గాంధీ, కొలుసు రమాదేవి, పెనుగంచిప్రోలు జెడ్పీటీసీ వూట్ల నాగమణి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, సంపత్ విజిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

45 మద్యం సీసాలు పట్టివేత

నందిగామ: పట్టణంలోని పలుచోట్ల పోలీసులు సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తుల నుంచి 45మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

వీరులపాడు: వీరులపాడు గ్రామానికి చెందిన వట్టికొండ నాగేశ్వరరావు 29వ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి రెండురోజులపాటు మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంటును నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ సభ్యుడు వట్టికొండ చంద్రమోహన్ సోమవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే పోటీల్లో విజేతలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు అందించనున్నట్లు చెప్పారు. నాలుగోబహుమతిగా రూ.3వేలు అందజేస్తామన్నారు. పోటీలకు హాజరయ్యే జట్లు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు.

స్పందనకు ఎనిమిది అర్జీలు

నందిగామ: స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో పి.సాయిబాబు తెలిపారు. పట్టణంలోని డివిజన్ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ఎనిమిది అర్జీలు అందినట్లు ఆర్డీవో తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోరుతూ ఆరు అర్జీలు, పోలీసు, మున్సిపల్ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ అందినట్లు వివరించారు. ఆయా అర్జీల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో హర్షసాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఫార్మా రంగంలో మంచి ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కొత్తగా ఫార్మసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఆహ్వానిస్తూ సీనియర్ విద్యార్థులు నియోఫెస్టా 2కె 24 పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు సోమవారం సిద్దార్థ ఫార్మసీ కళాశాలలో ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. ఈ వేడుకల్లో డార్విన్ ఫార్ములేషన్స్ అధినేత డాక్టర్ డి.లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మారంగం ఇప్పటికే అభివృద్ధి చెందిందని, దేశ విదేశాల్లోనూ మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులందరూ కోర్సులోని మెలకువలపై మంచి పట్టు సాధించి భవిష్యత్తులో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ ఎ.సునీత మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో వినూత్న పద్ధతులతో వేడుకలు నిర్వహించిన సీనియర్ విద్యార్థులను అభినందించారు. నైపుణ్యం గల అధ్యాపకుల, సీనియర్ విద్యార్థుల సలహాలు తీసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కయాకింగ్ జాతీయ పోటీలకు తన్విత్



విజయవాడస్పోర్ట్స్: కానోయింగ్, కయాకింగ్ సబ్‌జూనియర్, జూనియర్ జాతీయ పోటీలకు విజయవాడ క్రీడాకారుడు ఎం.తన్విత్ ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి 200 మీటర్ల జూనియర్స్, 500 మీటర్ల సబ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఫిబ్రవరి తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు జరిగే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగే జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన తన్విత్‌ను కయాకింగ్ సంఘం కార్యదర్శి జగదీష్ అభినందించారు.

రూ.1.92కోట్లతో దొడ్డదేవరపాడు అభివృద్ధి



దొడ్డదేవరపాడు(వీరులపాడు): గత ప్రభుత్వాల హయాంలో పూర్తి నిరాదరణకు గురైన పల్లెలు నేడు సకల వసతులతో పట్టణాలకు దీటుగా సగర్వంగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు గ్రామాల్లో ఏముందనే వారు సైతం నేడు ఆదే గ్రామాల్లో కనిపిస్తున్న అభివృద్ధిని, ఇళ్లముంగిటే అందుతున్న పౌరసేవలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ముఖ్యంగా ఐదేళ్లకు ముందు గ్రామాలను విడిచి వెళ్లిన వారు తిరిగి గ్రామంలోకి వస్తే ఇది మన ఊరేనా? అనేంతగా ఊరిలో మార్పు కనిపిస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి చిరునామాలుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఊరు మారిందని ముక్తకంఠంతో చెబుతున్నారు. అందుకు మరో ఉదాహరణే వీరులపాడు మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు దొడ్డదేవరపాడులో సుమారు రూ.2కోట్లతో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే), సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సదుపాయం, మంచినీటి వసతి, కల్వర్టులు, డొంక రోడ్లు, స్మశానాల అభివృద్ధి ఇలా గ్రామంలో ప్రజలకు అవసరమైన అన్నిరకాల మౌలికవసతులు కల్పించారు. అభివృద్ధిలో సీఎం జగన్ మార్క్ స్పష్టంగా కనిపిస్తోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సకల వసతులతో దర్శనమిస్తున్న దొడ్డదేవరపాడు పాఠశాల



గ్రామ సచివాలయ భవనం



బీసీ కాలనీలో నిర్మించిన కల్వర్టు



గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



కొనసాగుతున్న పైప్‌లైన్ ఏర్పాటు పనులు

దొడ్డదేవరపాడులో చేపట్టిన అభివృద్ధి పనులు..

- రూ.40 లక్షలతో దొడ్డదేవరపాడులో గ్రామ సచివాలయ నిర్మాణం
- రూ.52 లక్షలతో ఎస్సీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, సీసీడ్రైన్ల ఏర్పాటు
- రూ.17.50లక్షల నిధులతో రైతు భరోసా కేంద్రం
- నాడు–నేడు కింద రూ.48లక్షలతో పాఠశాల అభివృద్ధి
- రూ.10లక్షలతో బీసీ కాలనీలో కల్వర్టు నిర్మాణం
- రూ.10లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులు
- రూ.3లక్షలతో శ్మశానవాటికల్లో బోర్ల ఏర్పాటు, గ్రామంలో ఇతర అభివృద్ధి పనులు
- రూ.7లక్షలతో గ్రామంలోని డొంక రోడ్ల అభివృద్ధి
- రూ.4లక్షలతో తోటమూల నుంచి గ్రామం వరకు రోడ్డుకు మరమ్మతులు

జగన్ మార్క్ అభివృద్ధి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత గ్రామంలో జగన్ మార్క్ అభివృద్ధి కొట్టొచ్చినట్లు కనబడుతోంది. గతంలో మురుగునీటి పారుదల కాక, తాగునీరు సక్రమంగా అందక ప్రజలు అవస్థలు పడ్డారు. నేడు అన్ని వసతులతో సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

– తోట నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు

జగన్ రాకతో అన్నీ వచ్చాయి..



గ్రామంలో గడిచిన మూడు దశాబ్దాల కాలంలో అభివృద్ధి లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి జరిగింది. జగన్ సీఎం అయ్యాక గ్రామసచివాలయం వచ్చింది. రైతుభరోసా కేంద్రం వచ్చింది. పాఠశాలలు అభివృద్ధి చెందాయి..ఇలా ఒకటేమిటి జగన్ వచ్చాక మా ఊరికి అన్నీ వచ్చాయి.

– చెంద్యాల రామకృష్ణ, సర్పంచి

సత్రం ఏర్పాటుకు స్థలం మంజూరుపై హర్షం



పట్కారీలకు స్థల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో సత్రం నిర్మాణానికి 50సెంట్ల స్థలం మంజూరు చేయడంపై పట్టణానికి చెందిన పట్కారీలు హర్షం వ్యక్తంచేస్తూ రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పట్కారీల సత్రం నిర్మాణానికి స్థలం మంజూరు చేస్తూ జారీ చేసిన ఆదేశాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోమవారం తన నివాసంలో స్థానిక సోమవంశ సహస్ర అర్జున క్షత్రియ(ఖత్రి)వారికి అందజేశారు. ఈ సందర్భంగా విప్ ఉదయభానును మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పట్టణానికి చెందిన పలువురు పట్కారీలు ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మంది పట్కారీలు ఉండగా, శ్రీశైల మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లినపుడు వారు ఉండేందుకు సత్రం వంటి వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకురావడంతో వెనువెంటనే స్పందించి మాట్లాడి 50 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయించారని వివరించారు. స్థలం మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కృషి చేసిన విప్ ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. పట్కారీల సంఘ ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, వడేఘర్ రాజేశ్వరరావు, వడేఘర్ వెంకటేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



కంచికచర్ల: విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివితేనే ఉన్నతమైన స్థానానికి చేరుకుంటారని నవజీవన్ బాలభవన్ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ మేరుగ రత్నం పేర్కొన్నారు. కంచికచర్ల ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాల, పరిటాల, గొట్టుముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మత్తుపదార్థాలతో జీవితం చిత్తవుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన ఆవశ్యకతను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ రాజమణి, హెచ్ఎంలు శర్మ, రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.